క్లుప్తంగా

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ఎ.ఆనందరావు

కర్నూలు (న్యూసిటీ): దైనందిన జీవితంలో కంప్యూటర్ ఆవశ్యకత పెరిగిందని, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎ.ఆనందరావు చెప్పారు. సోమవారం లైఫ్ సైన్స్ భవనంలోని కంప్యూటర్ ల్యాబ్‌లో బోధనేతర సిబ్బందికి కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బోధనేతర ఉద్యోగులందరూ కంప్యూటర్ సంబంధ కోర్సులు నేర్చుకోవాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి, సిబ్బంది, కంప్యూటర్ శిక్షకుడు జాన్ పాల్గొన్నారు.

బీపీని నియంత్రణలో ఉంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

కర్నూలు(హాస్పిటల్): గర్భిణిలు బీపీని నియంత్రణలో ఉంచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.వెంకటరమణ చెప్పారు. సోమవారం గైనకాలజీ విభాగంలో ప్రీ క్లామ్సియా డే సందర్భంగా గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు 20 వారాల తర్వాత బీపీ 140/90 కంటే ఎక్కువగా ఉంటే ప్రీ క్లామ్సియా అంటారన్నారు. మూత్రంలో అల్బుమిన్ ప్లస్ ఉంటే కచ్చితంగా ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకోవాలని తెలిపారు. ఇదే సమయంలో సీబీపీ, కిడ్నీ, లివర్, ఫండస్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. 37 వారాల దాటిన తర్వాత ప్రసవం అయ్యేటట్లు చూసుకోవాలని పేర్కొన్నారు. 20 వారాల తర్వాత కాళ్లవాపు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. సమావేశంలో గైనకాలజిస్టులు డాక్టర్ ఎ. సుధారాణి, డాక్టర్ స్నిగ్ధం, డాక్టర్ సుధాకర్, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

26 నుంచి గ్రామీణ సువార్త మహాసభలు



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న సభ్యులు

కర్నూలు (టౌన్): ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు దిగువపాడు గ్రామంలో రక్షణ మహా పండుల పేరుతో గ్రామీణ సువార్త మహా సభలు నిర్వహిస్తున్నట్లు ఈవాంజిలికల్ సోల్జర్స్ ట్రస్టు (ఈఎస్‌టీ) ఫౌండర్ దాసరి సుధీర్ అన్నారు. సోమవారం స్థానికకోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి ప్రాంగణంలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాసభలకు మాసాపేట, గార్గేయపురం,బ్రాహ్మణకొట్కూర్,కడుమూరు, చౌటుకూర్ గ్రామాల ప్రజలు హాజరవుతున్నట్లు తెలిపారు.ఈ సభలకు దైవ సందేశం అందించేందుకు బి.జయకర్, మేరి జాస్మిన్,కోల్స్ సంఘ కాపారి రెవరెండ్ జీవన్‌రావు హాజరవుతున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలో చేపట్టే మరమ్మతు పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు టౌన్ డీఈఈ–1 రాజమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని నిర్మల్ నగర్, కృష్ణారెడ్డి నగర్, బళ్లారీ చౌరాస్తా సమీప పరిసరాల్లో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, ఫాస్ట్ ఎక్స్, విరుపాక్ష , ది కేరళ స్టోరీ, పొన్నియిన్ సెల్వన్-2, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3, సింహాద్రి
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కస్టడీ, ఫాస్ట్ ఎక్స్, బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, ఉగ్రం, విరుపాక్ష, ది కేరళ స్టోరీ, సింహాద్రి
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, విరుపాక్ష
ఐనాక్స్ : ఫాస్ట్ ఎక్స్, ది కేరళ స్టోరీ, ఉగ్రం, హసీనా, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3
భరత్ కాంప్లెక్స్ : ది కేరళ స్టోరీ, విరుపాక్ష, సింహాద్రి
శ్రీరామ : సింహాద్రి
రాజ్ : ఫాస్ట్ ఎక్స్
విజయ : బిచ్చగాడు 2

పిల్లలపై ఓ కన్నేద్దాం!

- వేసవి సెలవుల్లో సరదాల మాటున ప్రమాదాలు
- అప్రమత్తంగా లేకుంటే ఇబ్బందులు
- చిన్నారుల తల్లిదండ్రులకు హెచ్చరిస్తున్న వైద్యులు, అధికారులు



కర్నూలు(రాజ్‌విహార్): వేసవి సెలవులు రావడంతో పిల్లలు ఇంటి పట్టున ఉండరు. ఆటల పేరుతో బయటకు వెళ్తుంటారు. ఇలా వెళ్లిన వారు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం. ఈ నేపథ్యంలో ఎంత పనిలో ఉన్నా సరే తల్లిదండ్రులు పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు, అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఏ రూపంలోనైనా ప్రమాదం రావచ్చు

వేసవిలో వడదెబ్బలే కాదు ఎన్నో అపాయాలు పొంచి ఉన్నాయి. లోకం తెలియని చిన్నారులతో పాటు యువత కూడా వీటిని ఎదుర్కొంటోంది. పిల్లలపై నిఘా దూరమైతే సమస్యలు చేరవవుతాయి. కాలువలు, వాగులు, చెరువుల్లో ఈత సరదా, బైక్ రైడింగ్, మండే ఎండలు చిన్నారుల్ని ఇబ్బందులకు గురిచేసేవే. విద్యా సంస్థలు తెరిచే వరకు వీటి నుంచి వారిని సంరక్షించుకోవాల్సిన సమయమిది.

స్టీరింగ్ ఇచ్చే ముందు జాగ్రత్త

పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు వేసవి సెలవుల్లో సరదాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. ఈ జనరేషన్‌లో సైకిళ్లను పక్కన పెట్టి ద్విచక్ర వాహనాలు, కార్ల వైపు దృష్టి పెడుతున్నారు. పిల్లల సరదా కోసం కొందరు తల్లిదండ్రులు వారికి బండి తాళాలు ఇస్తుంటారు. వాహనం నడపడంపై పూర్తి అవగాహన లేకపోవడం, అతివేగం, రేసు వంటివి ప్రమాదాలకు తావిస్తోంది. మైనర్లు వాహనాలు నడిపితే వారితో పాటు పెద్దలపైనా కేసులు పెట్టేలా చట్టాలు ఉన్నాయి. దీంతో పోలీసులు నిఘా ఉంటుందని గుర్తించాలి.

పొంచి ఉన్న జలగండం

దేశంలో ఏటా వేల మంది చిన్నారులు జలమయమవుతున్నారు. కాలువలు, చెరువులు, వాగులు, వంకల్లో ఈత సరదాకు వెళ్లి మృత్యువాత పడుతున్నారని ఓ సర్వే నివేదికల అంచనా. తోటి పిల్లలతో వెళ్లి లోతు తెలియక, ఈత రాక మృత్యువాతకు గురవుతున్నారు. ఈ పరిస్థితి ఎదురుకాకుండా తల్లిదండ్రులే పిల్లలను దగ్గర ఉండి ఈతకు తీసుకెళ్లడం మంచిది.

ఎండలతో జాగ్రత్త

ఎండల్లో తిరగడంతో వచ్చే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెద్దలు అవగాహన కలిగి ఉండాలి. పిల్లల శారీరక స్థితిగతుల దృష్ట్యా 36 నుంచి 38 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే ఆరోగ్యపరమైన ఇబ్బందులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల దాటాయి. ఈ ఎండల్లో ఆటల వల్ల అలసట, నీరసం, వడగాల్పులతో వడదెబ్బ వంటి వాటికి గురవుతారు.

ఆహారం కీలకం

తీవ్ర ఎండల కారణంగా పిల్లల ఆహారంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. కలుషిత నీళ్లతో అతిసారం ఇతర సమస్యలు రావచ్చు. చల్లటి పానియాలు, పళ్ల రసాలు, మజ్జిగ, కొబ్బరి నీరు ఎక్కువగా ఇవ్వాలి. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉంచాలి. ఆకుకూరలు, కూరగాయలతో కూడిన సమతుల్య ఆహారం మంచిది. ముందస్తు జాగ్రత్తలు పిల్లలకు వివరించాలి.

ఇలా చేస్తే మరీ మంచిది

- సెల్ ఫోన్లతో ఎక్కువ సమయం గడపకుండా వార్త పత్రికలు, గ్రంథాలయాలకు అలవాటు చేయాలి. విజ్ఞాన, వినోదాత్మక ప్రదేశాల్ని చూపించాలి. సాయంత్రం వేళ ఆహ్లాదం కోసం పార్కులకు తీసుకెళ్లాలి.
- పిల్లలతో అధిక సమయం కేటాయించాలి. సామాజిక, మానవీయ అంశాలపై అవగాహన కల్పించాలి.
- ఖాళీ సమయంలో పాఠ్యపుస్తకాలు కాకుండా విజ్ఞాన దాయకమైన పుస్తకాల్ని చదివించేలా ప్రోత్సహించాలి.
- ఇంటి పనిలో సాయం చేసే అలవాటును నేర్పాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు సమాచారం ఇచ్చేలా చూసుకోవాలి.

భద్రతపై అవగాహన కల్పించాలి



వేసవి సెలవుల్లో పిల్లలకు భద్రతపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. వారి ఇష్టాలకు వదిలితే జరిగే పరిణామాలను వివరించాలి. స్కూళ్లు ఉన్నప్పుడు వాళ్లకు దినచర్య ఉంటుంది. అధ్యాపకుల పర్యవేక్షణ ఉంటుంది. కానీ సెలవుల్లో ఫ్రీ నెస్ పెరుగుతుంది. తల్లిదండ్రులు బిజీగా ఉండి పిల్లలను పట్టించుకోలేరు. అలాంటప్పుడు వేసవి శిక్షణ శిబిరాలకు పంపితే మంచిది.
– ఎస్. ఇక్రముల్లా, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ సైక్రియాట్రిస్టు, ప్రభుత్వ ఆసుపత్రి, కర్నూలు

పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నేటి కాలం పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా టీనేజర్ల విషయంలో వారితో మంచిగా మాట్లాడాలి. సెలవుల్లో ఇష్టానుసారంగా వెళ్లడం, తల్లిదండ్రులను చెప్పకుండా పనులు చేస్తారు. ఏదైనా ఘటనలు జరిగితే వారి ముందు చెప్పాలి. బిజీని పక్కన పెట్టి పిల్లలతో మాట్లాడేందుకు సమయం కేటాయించాలి. వాళ్లు ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరితో వెళ్తున్నారని గమనించాలి.
– సి. జ్యోతిర్మయి, సైకాలజిస్టు

చిన్నారులపై పర్యవేక్షణ అవసరం



వేసవిలో పిల్లలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలి. ముఖ్యంగా టీనేజ్ పిల్లలు వాహనాలు నడపడం, ఈత నేర్చుకోవడం, చెట్లు ఎక్కడం, గట్లపై తిరగడం చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల జరిగే పరిణామాలను వారికి వివరించారు. అలాగే మంచి చెడును వివరించాలి. అన్నింటి కంటే ముఖ్యం పిల్లల కదలికలపై ఓ కన్నేసి ఉంచాలి.
– ఎం. నాగార్జున రెడ్డి, ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపల్

'సిద్ధన్న గట్టు' సినిమా షూటింగ్



సుమన్‌కు స్వాగతం పలుకుతున్న నటులు మీనాక్షిరెడ్డి

కర్నూలు కల్చరల్: కేవీఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో మన దర్శకత్వంలో కె.వెంకటరాముడు నిర్మాతగా తెరకెక్కుతున్న 'సిద్ధన్న గట్టు' సినిమా షూటింగ్ రెండో షెడ్యూల్ సోమవారం రుద్రవరం గ్రామంలో జరిగింది. సినిమా ప్రధాన తారాగణం సుమన్ తల్వార్, సుధ, అక్సాఖాన్, జీబీ, బైటింటి మీనాక్షిరెడ్డి షూటింగ్‌లో పాల్గొన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన దర్శక నిర్మాతలతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా షూటింగ్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరుగుతుంది. చిత్ర యూనిట్‌తో పాటు మారుతి, ఆర్‌ఆర్‌ఆర్ సింగర్ ప్రకృతి రెడ్డి, బేబీ సహస్ర, రాధిక, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన త్రీటౌన్ సీఐ



త్రీటౌన్ సీఐ మురళీధర్‌రెడ్డి

కర్నూలు: కర్నూలు మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐగా మురళీధర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడున్న సీఐ తబ్రేజ్‌ను వీఆర్‌కు బదిలీ చేసి స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఉన్న మురళీధర్ రెడ్డిని మూడవ పట్టణానికి నియమిస్తూ ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. 1996లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరిన ఈయన జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. 2008 నుంచి 2010 వరకు త్రీటౌన్ ఎస్‌ఐగా కూడా పనిచేశారు.

ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న పూజారులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. ఇందులో రూ.15.23 లక్షల ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 72 రోజుల్లో అమ్మవారికి భక్తులు రూ.15,23,196 సమర్పించారని చెప్పారు. కానుకల లెక్కింపులో దేవస్థానం చైర్మన్ కృష్ణుడు, జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



108లో జన్మించిన ఆడబిడ్డను చూపుతున్న ఈఎంటీ

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన గర్భిణి సంధ్య సోమవారం తెల్లవారుజామున 108 అంబులెన్స్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కారుమంచి గ్రామానికి చెందిన సంధ్యకు నాల్గవ కాన్పు పురిటి నొప్పులు రావడంతో ఆశా కార్యకర్త పద్మావతి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చింది. వెంటనే కారుమంచి చేరకున్న అంబులెన్స్ డ్రైవర్ మల్లికార్జున, ఈఎంటీ వీరేష్ గర్భిణిని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. తల్లీబిడ్డ సురక్షితంగా ఉండగా, వారిని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా నారాయణరెడ్డి



కర్నూలు కల్చరల్: ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా డీసీడీఆర్‌సీ సభ్యులు నరహరి నారాయణరెడ్డి నియమితులయ్యారు. ఆదివారం కర్నూలులో జరిగిన శతాధిక కవి సమ్మేళనంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నారాయణరెడ్డిని నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. తెలుగు భాషా సాహిత్యానికి చేసిన సేవకు గుర్తింపుగా నారాయణ రెడ్డిని గౌరవాధ్యక్షుడిగా నియమించారు. ఆయన నియామకంపై పలువురు సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

గోనవరం వాసికి డాక్టరేట్



డాక్టరేట్‌కు ఎంపికైన సాహెబ్‌ఖాన్

పాణ్యం: మండలంలోని గోనవరం గ్రామానికి చెందిన సాహెబ్‌ఖాన్ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఫిజిక్స్ విభాగంలో జమాలయ్య పర్యవేక్షణలో 'ఆప్టికల్ అనాలసిస్ ఆఫ్ ప్రసోడైమియం సమేరియం అండ్ యూరోపియం, డోపుడ్ స్ట్రోంటియం, గాడోలినియం, ఫాస్ఫేట్ నానో ఫాస్ఫర్స్ ఫర్ డిస్‌ప్లే అప్లికేషన్' అనే అంశంపై పరిశోధన చేసి పత్రాలను సమర్పించగా అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రకటించింది.

నేడు వాహనాల వేలం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఎస్పీ కార్యాలయ ఆవరణలో మంగళవారం వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టూటౌన్ పోలీస్టేషన్ పరిధిలో పట్టుబడి సరైన పత్రాలు, యజమానుల ఆచూకీ తెలియని వాహనాలను వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.3వేలు డిపాజిట్‌ను టూటౌన్ స్టేషన్‌లో చెల్లించి రసీదు పొందాలని, రసీదు ఉన్న వారినే వేలం పాటకు అనుమతిస్తామని చెప్పారు.

పోరాటాలకు సిద్ధంకండి

కర్నూలు (రూరల్) : కార్మికులు తమ హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధమవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈఎస్ఐ హాస్పిటల్స్‌ను కేంద్రం తన పరిధిలోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ 26వ తేదీన కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా రెండు బృందాలు పర్యటించడం జరుగుతుందన్నారు. రాబోవు కాలంలో అన్ని సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, ఈరన్న, సాయిబాబా, ఉమాదేవి, విజయ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ

గడివేముల: మండలంలోని పెసరవాయి గ్రామ పొలాల్లో సోమవారం మట్టి నమూనాలను సేకరించినట్లు ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. క్రిబ్‌కో ప్రతినిధి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలో 50 మంది రైతుల పొలాల్లో శాంపిల్స్‌ను సేకరించామని, 15 రోజుల్లో ఫలితాలను రైతులకు అందజేస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన లింగన్న

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రహదారిలో బొలెరో వాహనం ఢీకొని స్థానిక బీసీ కాలనీకి చెందిన లింగన్న అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కోడుమూరులోని బీసీ కాలనీకి చెందిన లింగన్న మరో వ్యక్తితో కలిసి కర్నూలులో గౌండ పని ముగించుకొని బైక్‌పై కోడుమూరుకు వస్తుండగా పట్టణ సమీపంలోని పత్రప్పజిన్ను వద్ద కర్నూలు వైపు వెళ్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. అయితే బొలెరో డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వేగంగా కర్నూలు వైపు వెళ్లిపోయాడు. స్థానికులు కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులుకు ప్రమాద విషయాన్ని తెలియజేయడంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చే సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మున్సిపల్ ఎస్ ఈ వేణుగోపాల్, అసిస్టెంట్ సీటీ ప్లానర్ రంగ స్వామి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

సమస్యలివే...

- తమ ఏరియాలో డ్రైనేజీ కాల్వలను మరమ్మతులు చేయాలని లక్ష్మీనగర్‌కు చెందిన సి.హెచ్. శ్రీనివాసులు విన్నవించారు.
- తమ కాలనీలో నూతనంగా పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని ఎల్.పేట గ్రామస్తులు రామాంజనేయులు, చిన్న మల్లయ్య కోరారు.
- తమ ఏరియాలో కరెంటు స్తంభాలు, వీధి లైట్లు బాగు చేయించాలని గంగావతి నగర్ కాలనీ వాసులు సుధాకరప్ప విన్నవించారు.
- సర్వీసు రోడ్డును పునరుద్ధరించాలని ఇందిరా గాంధీనగర్‌కు చెందిన శివారెడ్డి కోరారు.
- తమ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కొండారెడ్డినగర్‌కు చెందిన నాగేశ్వరరావు కమిషనర్‌కు అర్జీ అందజేశారు.

సంక్షిప్తం

కేతు విశ్వనాథరెడ్డి మృతి తీరనిలోటు

కర్నూలు కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అభ్యుదయ రచయితల సంఘం మాజీ అధ్యక్షుడు ప్రముఖ కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మృతి తీరని లోటని నంది అవార్డు గ్రహీత, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. సోమవారం తెల్లవారు జామున ఆయన గుండె పోటుతో మరణించారని తెలిపారు. రాయలసీమలో కథా సాహిత్యం వృద్ధి చెందడానికి ఆయన చేసిన కృషి విశేషమని పేర్కొన్నారు. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మృతికి సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసమూర్తి, ఆవుల బసప్ప సంతాపం ప్రకటించారు.

సెలవుల్లో విద్యుత్ అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్, రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సెలవుల్లో వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో రూరల్స్ ఈఈ శ్రీనివాసుబాబు నెల రోజులు, కర్నూలు టౌన్ ఈఈ రమేష్ 15 రోజులు సెలవుల్లో వెళ్లినట్లు సోమవారం ఆ శాఖ అధికారులు తెలిపారు.

రేపు ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 24వ తేదీన కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో శిథిలమైన పాత ధ్వజ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ప్రతిష్ఠించనున్నామని ఈఓ సీతారామిరెడ్డి, దేవస్థానం చైర్మన్ తిరుపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని భగవంతుడి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని డ్యామ్ అధికారులు సోమవారం తెలిపారు. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం జలాశయంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

నోటీస్ బోర్డు

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. 136 సచివాలయాల పరిధిలో 132 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం 431 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక నగరపాలక రెవెన్యూ విభాగం హాలులో ఉదయం 10 గంటల నుంచి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

మూగజీవాల దాహార్తి తీర్చండి



పక్షుల కోసం వర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన నీటి బాకెట్ల వద్ద రిజిస్ట్రార్, విద్యార్థులు

కర్నూలు (న్యూసిటీ) : వేసవిలో పక్షులు, మూగజీవుల దాహార్తి తీర్చేందుకు ఇంటి ఆవరణలో నీటి కుండలు ఏర్పాటు చేయాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం వర్సిటీ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నీటి కుండలు ఏర్పాటు చేశారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండటంతో మూగజీవాలు, పక్షులు దాహంతో చనిపోతున్నాయి. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ఇంటి పరిసరాల్లో నీటి కుండలు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప, బోధన సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

31న ఖాదర్‌లింగస్వామి ఉరుసు ప్రారంభం



స్వామి సమాధిని అలంకరించిన దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసు ఉత్సవాలు ఈనెల 31 నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయని ధర్మకర్త సయ్యద్ మున్నపాషా తెలిపారు. సోమవారం ఆయన ఉరుసు తేదీలను ప్రకటించారు. 31న స్వామి సమాధిని సుగంధ ద్రవ్యాలతో శుభ్రచేయడం, జూన్ 1న గంధం, 2న ఉరుసు ఉత్సవాలు ఉంటాయని, 3న (సఫరాలూట్‌నా) స్వామి ప్రసాదం పంపిణీ, 4న జియారత్ వేడుకలు ఉంటాయని ఆయన తెలిపారు. కాగా ఉరుసు ఉత్సవాల సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మకర్త మున్నపాషా ఇంటి నుంచి ప్రత్యేక చాదర్‌ను బ్యాండు మేళాలు డప్పువాయిద్యాల మధ్య దర్గాకు తెచ్చి ఫాతెహాలు చేశారు. ఉరుసు రోజు వరకు ప్రతి రోజు రాత్రి ఫాతెహా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

కర్నూలు (రూరల్): డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి సూచించారు. సోమవారం నగరంలోని సుందరయ్య భవన్‌లో డ్వాక్రా సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సు నిర్వహించారు. జి.ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాజరై మాట్లాడారు. జగనన్న ఆసరా పథకాన్ని అన్ని సంఘాలకు వర్తింపజేయాలన్నారు. మొదటి విడతలో 90 లక్షల మందికి రుణ విముక్తి కల్పించగా ఏప్రిల్‌లో విడుదల చేసిన మూడో విడతలో 74 లక్షల మందికి రుణ విముక్తి కల్పించారు. మిగిలిన వారికి కూడా అర్హతను ప్రామాణికంగా చేసుకుని అర్హులను గుర్తించాలన్నారు. సున్నా వడ్డీ పథకాన్ని మూడు లక్షల నుంచి పది లక్షలకు పెంచాలన్నారు. బ్యాంకు అధికారులు లోన్ ఇచ్చే సమయంలో డిపాజిట్ చేయాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. అభయహస్తం పథకం ద్వారా అర్హత కలిగిన మహిళలను గుర్తించి పెన్షన్లు ఇవ్వాలన్నారు. పొదుపు సంఘాల సమన్వయం, సాధికారత కోసం కృషి చేస్తున్న ఆర్పీలపై పనిభారం తగ్గించి బయట ప్రాంతాలకు వెళ్లినప్పుడు టీఏ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి అరుణ, షబానా, రషీద్, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.